# ఎవరి లెక్కలు వారివే!



- ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ..
- గెలుపు ఓటములపై అభ్యర్థుల తర్జన భర్జనలు
- పోలైన ఓట్ల ఆధారంగా లెక్కలు అంచనాల్లో తలమునకలు
- కొన్ని చోట్ల ద్విముఖ పోటీ.. అక్కడక్కడా త్రిముఖ పోటీ
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- రేపే ఉత్కంఠకు తెర

రంగారెడ్డి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ఘట్టం ముగిసింది. ఇక కీలకమైన ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న వెలువడనున్నాయి. ఎవరిని పలుకరించినా.. ఎక్కడ ఇద్దరు గుమికూడినా ఎవరు గెలుస్తారనే చర్చనే జరుగుతున్నది. ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. విజయావకాశాలపై ఎవరికీ వారు అంచనాల్లో నిమగ్నమయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 209 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల లెక్కలు, ఆయా ప్రాంతాల్లో ఉన్న పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుని ఎవరికి వారు బయటకు ధీమాను వ్యక్తం చేస్తున్నప్పటికీ లోపల మాత్రం ఒకింత భయం పార్టీలను వెంటాడుతున్నది.

**ద్విముఖ, త్రిముఖ పోటీ**

కొన్ని నియోజకవర్గాల్లో ద్విముఖ పోటీ ఉండగా.. మరికొన్నింటిలో త్రిముఖ పోటీ నెలకొన్నది. త్రిముఖ పోరులో ఎవరు? ఎవరి విజయవకాశాలను దెబ్బతీస్తారనే విషయంలో పార్టీల అభ్యర్థులు అంతర్మథనం చెందుతున్నారు. గత ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లను, ఈ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను పరిగణలోకి తీసుకుని లెక్కలేసుకుంటున్నారు. తగ్గిన ఓట్లు ఎవరికి చేటు తెస్తుందోన్న భయం సైతం అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తున్నది. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ.. పోలింగ్ గడువు ముగిసే సమయానికి పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. దీంతో సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలో వేచి ఉన్నవారికి అధికారులు అవకాశం ఇవ్వడంతో జిల్లాలో అక్కడక్కడా రాత్రి వరకు కూడా పోలింగ్ కొనసాగింది. చివరి నిమిషంలో పెరిగిన పోలింగ్ సైతం ఎవరికి లాభం చేకూరుతుందో! అన్ని విషయాల్లోనూ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. ఓటరు నాడిపై సైతం తమ అనుయాయులతో ఆరా తీస్తున్నారు.

## పొంతనలేని ఎగ్జిట్ పోల్స్

సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు గందరగోళానికి తెరలేపాయి. ఎవరికీ స్పష్టమైన ఆధిక్యతను ఇవ్వకపోవడంతో సర్వేలపై స్పష్టత కొరవడింది. కొన్ని సర్వేలు బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతున్నదని చెబితే.. మరికొన్ని సంస్థలు హంగ్ వస్తుందని ప్రకటించి అటు నేతలను, ఇటు ప్రజలను సందిగ్ధంలో పడేశాయి. కచ్చితత్వం లోని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను పరిగణలోకి తీసుకోలేమని ప్రజానీకం పేర్కొంటున్నది. ఇందుకు 2018 నాటి ఎగ్జిట్ పోల్స్‌ను ఉదాహరణకు చెబుతున్నారు. అప్పట్లో సర్వే సంస్థలు జనం నాడిని పట్టుకోవడంలో విఫలం కావడంతో బీఆర్ఎస్ గెలుపును అంచనాలు వేయలేకపోయాయని, ఈసారి కూడా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల మధ్య పొంతన లేకపోవడంతో వాటిని నమ్మాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొంటున్నారు.



# తగ్గిన పోలింగ్ శాతం

- గడప దాటని పట్టణ ఓటర్లు
- 2018లో 62 శాతం.. 2023లో 59.96 శాతం
- గత ఎన్నికలతో పోలిస్తే.. 2 శాతానికి పైగా తగ్గిన ఓటర్లు
- తగ్గిన పోలింగ్ శాతంతో ఎవరికి చేటు అనే దానిపై సర్వత్రా చర్చ

రంగారెడ్డి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా.. పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపలేదు. 2018 ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదవ్వగా.. ఈ ఎన్నికల్లో 59.96 శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే.. 2 శాతానికి పైగా ఓటర్లు తగ్గారు. మహేశ్వరం, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో గత ఎన్నికలు, ఈసారి ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. ఈసారి స్వల్పంగా ఓటింగ్ పెరిగింది. పోలింగ్ శాతం అనుకున్నంతగా పెరగకపోవడంతో తగ్గిన పోలింగ్ సరళితో ఎవరికి నష్టం! అన్నదానిపై రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.

**2018, 2023 ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం ఇలా..**

| నియోజకవర్గం | 2018 | 2023 |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 76.38 | 74.93 |
| ఎల్బీనగర్ | 49.58 | 49.07 |
| మహేశ్వరం | 55.34 | 55.39 |
| రాజేంద్రనగర్ | 56.89 | 55.83 |
| శేరిలింగంపల్లి | 48.61 | 48.75 |
| చేవెళ్ల | 79.02 | 74.18 |
| కల్వకుర్తి | 87.21 | 83.26 |
| షాద్‌నగర్ | 88.07 | 82.09 |
| మొత్తం | 62.00 | 59.94 |

**జిల్లాలో నమోదైన పోలింగ్ నియోజకవర్గాల వారీగా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,23,968 | 1,21,483 | 08 | 2,45,459 |
| ఎల్బీనగర్ | 1,49,827 | 1,41,492 | 28 | 2,91,347 |
| మహేశ్వరం | 1,54,746 | 1,48,010 | 06 | 3,02,762 |
| రాజేంద్ర నగర్ | 1,68,996 | 1,55,920 | 01 | 3,24,917 |
| శేరిలింగంపల్లి | 1,86,877 | 1,70,175 | 22 | 3,57,074 |
| చేవెళ్ల | 99,705 | 94,638 | 00 | 1,94,343 |
| కల్వకుర్తి | 1,02,739 | 98,546 | 00 | 2,01,285 |
| షాద్‌నగర్ | 98,577 | 95,439 | 01 | 1,94,017 |
| మొత్తం | 10,85,435 | 10,25,703 | 66 | 21,11,204 |

# అభ్యర్థుల జాతకాలపై జోస్యం

- మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి గెలుపుపై అనుచర గణం చర్చ
- ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం
- ఫలితాలపై ఉత్కంఠ

బడంగ్‌పేట, డిసెంబర్ 1 : మహేశ్వరం నియోజకవర్గం గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గెలుపు ఓటములపై తెగచర్చ జరుగుతున్నది. నియోజకవర్గంలో ఎవరిని కదిలించినా అదే చర్చ జరుగుతున్నది. ఎవరికి నమ్మకం అయిన దేవుడిపై వారు భారం వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల జాతకాలపై అనుచర గణం జోస్యం చెప్పించుకుంటున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న ఓటర్ మహాశయులు ఇచ్చే తీర్పుపై విశ్లేషణలు చేయించుకుంటున్నారు. వివిధ సంస్థలు ఇస్తున్న ఎగ్జిట్ పోల్ సర్వేలపై చర్చలు జరుపుతున్నారు. పార్టీలకు ఉన్న బలాబలాలపై అంచనాలు వేసుకొని ఓట్టింగ్ సరళిని సమీక్షించుకుంటున్నారు. నాయకులు నెల రోజులుగా చేసిన విస్తృత ప్రచారం ఓటర్ చెవికి ఎక్కిందా లేదా అనే కోణంలో ఎవరికి వారు ఆత్మపరిశీలనలో పడ్డారు. విశ్లేషకులతో చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో ఉన్న 5,46,577 ఓటర్లకు 56 శాతం మాత్రమే పోలింగ్ కావడంతో అంచనాలకు అవకాశం లేకుండా పోయిందని చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అభివృద్ధిని నమ్మకొని ప్రచారం చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ బీసీ, స్థానికతపై నమ్మకం పెట్టుకొని ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నియోజక వర్గానికి కొత్త కావడంతో చెప్పు కోవడానికి అంశాలు ఏవీ లేకపోవడంతో మార్పు కావాలని ప్రచారం చేశారు. నియోజకవర్గ ప్రజలు మాత్రం ఎవరు ఎన్ని ఆశలు చూపినా అభివృద్ధికి ఓటు వేశామని చెప్పుకొస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వేవ్ వచ్చిందని చెప్పుకొచ్చినప్పటికీ నియోజకవర్గ ఓటర్లు పెద్దగా పట్టించుకోన ట్లు కన్పించింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల జాతకాలు ఈనెల 3న వచ్చే ఫలితాలలో తేలనున్నది. గడిచిన ఐదు సంవత్సరాల కాలం లో చేసిన అభివృద్ధికి ప్రజలు ఓట్లు వేశారని మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వనున్నారని బీఆర్ఎస్ శ్రేణులు విశ్వాసంగా ఉన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల ఓటు బ్యాంక్ దాదాపుగా బీఆర్ఎస్‌కు వేశారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

**సీనియర్ సివిల్ జడ్జి ఇందిర**

ఆర్కేపురం, డిసెంబర్ 1 : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చేయూత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సరూర్‌నగర్‌లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ డేగా పాటిస్తున్నామన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి భరోసానిచ్చేందుకు, ప్రజల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. డబ్ల్యూహెచ్ఓ అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వైద్య రంగంలో అనేక రోగాలకు మందులు, చికిత్సలు కనుకొన్నా ఎయిడ్స్‌కు మాత్రం ఇంకా మందు అందుబాటులోకి రాలేదన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కొన్ని చికిత్సా విధానాలతో వ్యాధి పూర్తిగా నయం కాదని, వ్యాధి సంక్రమించకుండా నిరోధించవచ్చని చెప్పారు.



ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

# లెక్క తప్పొద్దు!

**ప్రతి ఓటుపై విశ్లేషణ**



'అన్నా.. మా వార్డుల లీడ్ వస్తుంది. ప్రతి ఓటరును కలిసినం'..
'కాక.. మా కాలనీల ఈ సారి మన పార్టీకే ఎక్కువ ఓట్లు పడ్డయి'
'పొయిన సారికంటే ఒక్క ఓటయినా ఎక్కువొస్తదే మనకు'..
ఇలా చర్చలే చర్చలు. ఎవరి ధీమా వారిది.

మెజారిటీ వస్తుందని, తమ ప్రాంతంలో ఎక్కువ లీడ్ వస్తుందని ఒకరు చెప్తుంటే.. గతంలో కంటే మంచి మెజారిటీ ఇస్తామని ఇంకొకరు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దాదాపు నెల రోజుల నుంచి రాజకీయ పార్టీలు ప్రచారంలో తలమునకలయ్యాయి. ఎన్నికలు పూర్తికావడంతో ఇక విశ్లేషణలు మొదలు పెట్టాయి. ఎక్కడ ఎన్ని ఓట్లు పడ్డాయనే స్థానిక నేతలు లెక్కలు తీస్తున్నారు. మున్సిపాలిటీలోని వార్డులు, పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు పెడుతున్నారు. ఏయే వర్గాలు తమకు ఓటేశారో లెక్కలు తీస్తున్నారు. ఎవరు వేస్తే ఎంత మెజారిటీ వస్తుంది, లీడ్ వచ్చేందుకు ఏయే అంశాలు అనుకూలిస్తాయనే అంశాలపై చర్చిస్తున్నారు. మున్సిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల వారీగా అయిన పోలింగ్ ఎంత, ఏ వార్డులో ఎక్కువగా పోలయ్యాయి, ఎక్కడ తక్కువయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటనే విషయాలపై విశ్లేషిస్తున్నారు. ఆయా వార్డుల్లో ఎక్కువ పోలింగ్ అయితే ఎవరికి అనుకూలిస్తుంది, తక్కువ పోలింగ్ అయితే ఎవరికి నష్టమొస్తుందనే అంశాలపై లోతుగా చర్చిస్తున్నారు. కౌంటింగ్‌కు ఇక ఒకరోజే మిగిలి ఉండటంతో ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయా పార్టీలకు ఇన్‌చార్జిలుగా ఉన్నవారు మెజారిటీపై నమ్మకంతో ఉన్నారు.

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 1